క్లుప్తంగా

సన్మానం



వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిలానీబాషాను సన్మానిస్తున్న ఆల్‌మేవా నేతలు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారులు జిలానీ బాషాను వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులుగా నియమించడం హర్షణీయమని ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు జీఏ హమీద్‌సర్దార్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆల్‌మేవా నేతలు జిలానీ బాషాను ఘనంగా సన్మానించారు. హమీద్‌సర్దార్ మాట్లాడుతూ మైనారిటీ వర్గాలకు జిలానీబాషా చేస్తున్న సేవలకు గుర్తింపుగా పదవి లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇలియాజ్ బాషా, హుసేన్‌పీరా, ఓంకార్, ఖాజామోహిద్దీన్ గఫార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లు తిరుగుతున్నాయని వెళ్తే క్యాన్సర్ నిర్ధారణ

కర్నూలు(హాస్పిటల్): కళ్లు తిరుగుతున్నాయని వైద్యుల వద్దకు వెళ్తే నిర్వహించిన వైద్యపరీక్షల్లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ బయటపడింది. ప్రాథమిక దశలో వెలువడిన క్యాన్సర్‌కు అవసరమైన చికిత్స తీసుకోగా ఆమె కోలుకున్నారు. వివరాలను శుక్రవారం స్థానిక కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో న్యూరాలజిస్టు డాక్టర్ నిశాంత్ రెడ్డి వివరించారు. కర్నూలు నగరానికి చెందిన జయమ్మ(62) నడకలో సమస్యలు, కళ్లు తిరగడం, మాట తడబడటం లాంటి ఇబ్బందులతో కిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లింది. లక్షణాలను బట్టి పార్నియోప్లాస్టిక్ ప్రొఫైల్ పరీక్ష చేయించగా యాంటిరో యాంటిబాడీలు పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆమె శరీరంలో క్యాన్సర్ ఉందని గ్రహించి పెట్ సిటిస్కాన్ చేయించారు. దీంతో ఆమె రొమ్ములో క్యాన్సర్ మొదటిదశలో ఉన్నట్లు తేలింది. వెంటనే ఆమెను సర్జికల్ ఆంకాలజిస్టుకు రెఫర్ చేయగా శస్త్రచికిత్స చేసి కీమోథెరపి ఇచ్చారు. క్యాన్సర్‌ను ఇలా యాంటిబాడీలతో గుర్తించడం చాలా అరుదుగా జరుగుతుందని డాక్టర్ నిశాంత్‌రెడ్డి వివరించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కర్నూలు కల్చరల్: గణాంక శాస్త్ర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పలు ఉపాధి అవకాశాలు ఉన్నాయని నేషనల్ శాంపిల్ సర్వే శాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎ.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు సూచించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిక గణాంకాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థినులు బి.అనిత, పి.సుగుణ కుమారి, ఆర్.నీలిమ, రమ్య, వి.దివ్య, కె.మల్లేష్ గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎ.జమినా జకోబ్, కె.నాగసాయి మృదుల, వై.దీపిక, కె.సాయికృష్ణ, ఎస్.తాజుద్దీన్‌లు, తృతీయ బహుమతి శంకరాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కె.వినోద్‌కుమార్, డి.దామోదర్‌రెడ్డి, బి.సుధీర్ గౌడ్, ఎస్.ఫయాజ్ అహ్మద్, కె.శ్రీమన్ కుమార్ గెలుచుకున్నారు. పాల్గొన్న మిగతా కళాశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అవగాహన సదస్సులో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శాంత, కళాశాల స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి ఐ.కల్యాణి, రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐసీడీఎస్ పీడీల సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) జిల్లాధికారుల (పీడీల) సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు కర్నూలు జిల్లా ఐసీడీఎస్ పీడీ కేఎల్ఆర్‌కే కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ.క్యాంప్‌లోని కర్నూలు అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పీడీలు, సీడీపీఓలు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాజెక్టుల పునర్‌వ్యవస్థీకరణ జరిగిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, సెల్ఫీ, కోనసీమ థగ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, కోనసీమ థగ్స్, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్, కొకైన్ బీర్, అలా మొదలైంది
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ: డెడ్‌లైన్, **విజయ :** సార్

వేసవి దాహార్తి తీరేలా..!

- కర్నూలు నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు
- సమస్య ఉత్పన్నమయ్యే కాలనీల గుర్తింపు
- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారుల నిర్ణయం
- సుంకేసుల, జీడీపీలలో నీటి నిల్వలు



నిండుగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

కర్నూలు (టౌన్): వేసవిలో కర్నూలు నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నగరపాలక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. నగరంలో మూడు నియోజకవర్గాలు విలీనమయ్యాయి. కర్నూలు నియోజకవర్గంలో 33 వార్డులు, పాణ్యం అర్బన్‌లో 16 వార్డులు, కోడుమూరు అర్బన్ నియోజకవర్గంలో 3 వార్డులు ఉన్నాయి. ఇటీవల పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం గ్రామాలు విలీనమయ్యాయి. వేసవిలో నగరంలో పెద్దపాటు, పందిపాడుతోపాటు 23 కాలనీలలో తాగునీటి సమస్య వస్తుందని అధికారులు గుర్తించారు. స్టాంటన్‌పురం, సోనియాగాంధీనగర్, అంబేడ్కర్‌నగర్, సమతానగర్, మమతానగర్, గీతా ముఖర్జీనగర్, ధనలక్ష్మీనగర్, సోమిశెట్టి కాలనీ తదితర కాలనీలను గుర్తించారు. ఆయా కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా ఆయా వార్డుల పరిధిలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయడంతోపాటు స్థానికంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.59.67 లక్షల బడ్జెట్ కేటాయింపు

నగర ప్రజలకు వేసవి దాహార్తి తీర్చేందుకు నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. వచ్చే మార్చి, ఏప్రిల్, మే నెలలను పరిగణలోకి తీసుకొని రూ. 59.67 లక్షలు బడ్జెట్ కేటాయించారు. పాణ్యం అర్బన్ పరిధిలోని వార్డులకు రూ.9.98 లక్షలు, కర్నూలు నియోజకవర్గ ప్రజల కోసం రూ.9.98 లక్షలు, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లోని కాలనీలలో నీటి సరఫరా కోసం రూ.9.98 లక్షలు కేటాయించారు. అలాగే 1.00 హెచ్‌పీ, 1.05 హెచ్‌పీ, సబ్ మెర్సిబుల్ పంపుసెట్లు, పానెల్ బోర్డ్స్, కేబుల్స్ ఏర్పాటు చేయడం తదితర వాటికోసం రూ.9.98 లక్షలు, హిటాచీ, 140 కేపాసిటీ జేసీబీ, ట్రాక్టర్స్, లేబర్స్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం మరో రూ.9.97లక్షలు కేటాయించారు. ఈ నిధులు వెచ్చించి వేసవిలో కర్నూలు ప్రజలకు తాగునీటి ఇక్కట్లు రాకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 4,300 ఎంఎల్ నీరు

కర్నూలు నగరంలో 5.50 లక్షల జనాభా ఉన్నారు. అయితే నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సుంకేసుల, జీడీపీలలో నీటిని నిల్వ ఉంచారు.



మునగాలపాడు వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనుల దృశ్యం

సుంకేసులలో 1.110 టీఎంసీల నీరు, అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)లో 2.60 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. ఇక నగర శివారులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటి నిల్వ సామర్థ్యం 4,410 ఎంఎల్ కాగా ప్రస్తుతం 4,300 ఎంఎల్ నీరు ఉన్నట్లు నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

రూ.82 కోట్లతో పైప్‌లైన్ పనులు

సుంకేసుల నుంచి వచ్చే నీటిని కర్నూలు నగరవాసులు వినియోగిస్తున్నారు. అయితే అక్కడి నుంచి మునగాలపాడు పంపింగ్ స్టేషన్‌కు నీరు చేరుకోవాలంటే 23 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంది. సుంకేసుల నుంచి ఓపెన్ చానల్ ద్వారా నీటిని సరఫరా చేయడం వల్ల మధ్యలో నీటి ఆవిరితో పాటు పెద్ద ఎత్తున్న నీటి చౌర్యం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కరించేందుకు ఆరు నెలల క్రితం రూ.82 కోట్లతో సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. అదేవిధంగా మునగాలపాడు పంపింగ్ స్టేషన్ ప్రాంగణంలోనే 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులు 70 శాతం పూర్తి అయ్యాయి.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం



వచ్చే వేసవి కాలంలో నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాం. శివారు కాలనీలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. నీటి ఇబ్బందులు ఉంటే నగరపాలక కార్యాలయంలోనే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తాం. కాలనీవాసులు కోరిన మీదట అక్కడకు నీటి ట్యాంకర్ పంపిస్తాం. ఇప్పటికే 75 ఎంఎల్‌డీ నీటిని శుద్ధిచేసి పట్టణ ప్రజలకు అందిస్తున్నాం. మార్చి నెలాఖరు నాటికి మరోక వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంటు పనులు పూర్తి అవుతాయి. దీని ద్వారా అదనంగా 1.50 లక్షల మందికి నీటిని అందిస్తాం.

–భార్గవ్‌తేజ, నగరపాలక కమిషనర్

సంక్షిప్తం

నేడు విజ్ఞాన పీఠం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని విజ్ఞాన పీఠంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5.30 గంటలకు పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన పీఠం కరస్పాండెంట్ పి.పి. గురుమూర్తి శుక్రవారం తెలిపారు.

27న పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: కేజీఎస్ఎమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచించిన స్వాతంత్ర్యోద్యమ నవల 'అల్లూరి సత్యనారాయణ రాజు' పుస్తకాన్ని ఈ నెల 27వ తేదీ తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలోని గౌతమి సత్యాగ్రహాశ్రమంలో ఆవిష్కరిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ బి.రాజారావు తెలిపారు.

నేడు దాసరి రంగముని సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కందుకూరి విశిష్ట పురస్కారం గ్రహీత దాసరి రంగముని సంస్మరణ సభను శనివారం ఉదయం 10 గంటలకు మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య తెలిపారు.

విద్యుత్ బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ద్వారా అందరికీ డిమాండ్ నోటీసులు జారీ చేశామని, బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించి సహకరించాలన్నారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఎక్కడ ఉన్నా చెల్లించడం సులభమని పేర్కొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేద్దాం



పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్: కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును ఆపాలని కోరుతూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, మాదాసి మాదారి కురువ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను పెద్దపాడు గ్రామంలో ఆవిష్కరించి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఈ పాదయాత్రలో రైతులు, శ్రామికులు, మేధావులు, ఉద్యమ సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు. అప్పర్ భద్రను అడ్డుకుంటూ ఆర్‌డీఎస్ రాజోలి బండ తూముల నుంచి మహా పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఆర్‌వీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, నాయకులు ఎర్రకోట మల్లప్ప, రాముడు, చంటి డమ్మీశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, సమావేశంలో పాల్గొన్న అధికారులు

కర్నూలు కల్చరల్: నేషనల్ హైవేలపై (ఎన్‌హెచ్) ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్ వద్ద అండర్ పాస్‌నిర్మాణానికి సంబంధించి డిజైన్స్ ఎస్టిమేషన్స్ పనులు, సంతోష్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద ఐరన్ బ్యారికేడింగ్ పనులు, ఫ్లైఓవర్ మధ్యలో టూవీలర్స్ ప్రవేశించకుండా చేయాల్సిన పనులు, సంతోష్‌నగర్ నుంచి మానస డాబా వరకు సోలార్ లైట్స్ ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బళ్లారి చౌరస్తా ప్రాంతంలో రహదారుల విస్తరణ పనుల టీడీఆర్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. నగరంలో సీసీ కెమెరాల మరమ్మతులు త్వరగా చేయాలని ఆదేశించారు. ఐఆర్ఏడీకి సంబంధించి ఈడీఏఆర్‌గా మార్పు చేయడం జరిగిందని, ప్రమాదాలకు గురైన వారిని ఆరోగ్యశ్రీ కింద సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ప్రయాణికులు ఎవరైనా ప్రమాదానికి గురైన కూడా ఆరోగ్యశ్రీ కార్డు లేకున్నా వారికి అత్యవసర వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. నగరంలో ప్రస్తుతం పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు మాత్రమే తిరగడానికి అనుమతి ఇచ్చామన్నారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఆర్టీవో రమేష్, ఆర్టీసీ, మున్సిపల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత





అనుగ్రహ భాషణం చేస్తున్న జీయర్ స్వామి, పాల్గొన్న గోదా గోకులం భక్తులు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం లక్ష్మీనారాయణ ఇష్టి కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యాగశాల ద్వారతోరణ ధ్వజ, కుంభాభిషేకం, బాలభోగ నివేదన, విష్ణు సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు జరిగాయి. రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక నిఘా

– మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్

కర్నూలు(రాజ్‌విహార్): అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు గనులు, భూగర్భ శాఖ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రత్యేక మొబైల్ టీమ్‌తో తనిఖీలు చేయిస్తున్నామని, అనుమతులు లేకుండా క్వారీలు తవ్వినా, ఖనిజాలను తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, దేవనకొండ, నంద్యాల జిల్లాలో డోన్, బనగానపల్లె, బేతంచెర్ల తదితర ప్రాంతాల నుంచి వెళ్లే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. రాయల్టీ, వే బిల్లులు లేకపోయినా చర్యలు ఉంటాయని వెల్లడించారు.

లారీ, ఆటో ఢీ

క్రైం కార్నర్



నుజ్జునుజ్జు అయిన ఆటో

కర్నూలు: కర్నూలు శివారులోని రేడియో స్టేషన్ సమీపంలోని హోసన్నా మందిర్ వద్ద ఆటో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తమిళనాడుకు చెందిన లారీ కోడుమూరు వైపు నుంచి కర్నూలుకు వస్తుండగా కల్లూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వినోద్ కర్నూలు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ వినోద్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్, క్లీనర్ వాహనాన్ని వదిలి పరారయ్యారు. దీంతో పోలీసులు లారీని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు

కర్నూలు కల్చరల్: బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని డీఎస్‌వో రాజా రఘువీర్, అర్బన్ ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డిల గూడూరు మండలం పెంచికలపాడు వద్ద శుక్రవారం పట్టుకున్నారు. ఏపీ 21 టీవై 7959 నంబర్ ఆటోలో సుమారు ఎనిమిది క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు జిల్లా విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్‌ఫేర్)కు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి పది మంది విద్యార్థులు, పది మంది గైడ్ టీచర్లు పాల్గొంటారని డీఈఓ వి. రంగారెడ్డి తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ పర్యవేక్షణ చేస్తారని వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులు, విద్యార్థుల వివరాలు..

- కంబాలపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి జగన్ (పక్షులను పారదోలే పరికరం)
- గోనెగండ్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రవిచరణ్ తేజ (బహుళ ఉపయోగ సాధనం
- కర్నూలు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని హబీబా(మురికి నీటి శుద్ధి యంత్రం)
- బురాన్‌దొడ్డి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి డి.మురళి(ఆల్కహాల్ డిటెక్టింగ్ ఇంజిన్ లాకింగ్)
- తేర్నెకల్, శరీన్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు అఖిల, రాణి (రోడ్డు ప్రమాదాల నివారణ)
- కోసిగి మోడల్ స్కూల్ విద్యార్థి ఉదయ్ హర్షిత్ (బయో ప్లాస్టిక్)
- పత్తికొండ ఏపీఆర్ఎస్ విద్యార్థి డి.సిరాజుద్దిన్ (పర్యావరణ పరిరక్షణ)
- పెంచికలపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని షాహీన్ బీ(సులభ గణితం
- ఆరేకల్ ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ స్కూల్ విద్యార్థిని త్రివేణి(రేఖలు, కోణాలు)

యువతికి అరుదైన శస్త్రచికిత్స



ఆపరేషన్ అనంతరం కోలుకున్న పర్వీన్‌తో డాక్టర్ కె.జి. గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఓ యువతికి అరుదైన శస్త్రచికిత్స ద్వారా సమస్య పరిష్కరించారు వైద్యులు. వివరాలను శుక్రవారం స్థానిక బుధవారపేటలోని ఒమిని హాస్పిటల్‌లో యురాలజిస్టు డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి వివరించారు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన పర్వీన్(23) దీర్ఘకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. అనేక హాస్పిటల్స్‌లో వైద్యులకు చూపినా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో ఇటీవల ఆమె ఒమిని హాస్పిటల్‌లో డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి వద్దకు వచ్చింది. ఆయన సిటి స్కాన్ పరీక్ష చేయించగా మూత్రపిండాల్లో రాళ్లులేవని తేలింది. దీంతో ఆయన ఐవీపీ టెస్ట్ చేయించగా మూత్రనాళాలకు రక్తనాళాలు చుట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. ఇది అరుదైన వ్యాధిగా భావించి వారం రోజుల క్రితం ఆమెకు శస్త్రచికిత్స ద్వారా మూత్రనాళాలు, రక్తనాళాలు వేరుచేశారు. ఇలాంటి అరుదైన ఆపరేషన్లు ఇప్పటి వరకు 8 మంది రోగులకు మాత్రమే చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఒమిని హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ శశివర్ధన్‌రెడ్డి, డాక్టర్ త్రినాథ్, అనెస్తెటిస్ట్ డాక్టర్ నవంతిరెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు జూనియర్ సెక్షన్ ఆఫీసర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి



కర్నూలు(లీగల్): కర్నూలుకు చెందిన న్యాయవాది బి.విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్ర హైకోర్టు జూనియర్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. గత నెల 20వ తేదీన నిర్వహించిన రాత పరీక్షలలో ఈయన ఎంపికయ్యారు. ఈయన గత 5 సంవత్సరాలుగా సీనియర్ న్యాయవాది డి.ఎల్లారెడ్డి ఆఫీసులో జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఈయన ఎంపిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

టైలర్స్ డేను జయప్రదం చేయండి



టైలర్స్ డే పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): టైలర్స్ డే వేడుకలను ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఖలీల్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక పాతబస్తీలోని ఉర్దూ ఘర్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హవా జయంతిని పురస్కరించుకొని టైలర్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, పెద్ద పెద్ద మాల్స్ వచ్చాక టైలర్ల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ మోహన్‌రెడ్డి టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక తోడ్పాడు అందించడం అభినందనీయమన్నారు. షాపుల్లో పనిచేసే, ఇళ్లలో పనిచేసుకునే మహిళా టైలర్లకు సైతం పథకాన్ని వర్తింజేయాలని కోరారు. 28న జరిగే టైలర్స్ డే కార్యక్రమానికి కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్‌తో పాటు నగర మేయర్ బీవై రామయ్య, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఫరూక్, నేషనల్ బాషా, బెనర్జీ, వేణుగోపాల్, నరసింహులు, రామకృష్ణ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీపై పోరాటాలకు సిద్ధం కావాలి'



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పాలనా విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక మైనార్టీలు, దళితులు, రైతులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. కార్మిక హక్కులు కాలరాయడం, నిరుద్యోగం పెరగడానికి కారణంగా మారిందని విమర్శించారు. ఉపాధికల్పన నీరు గార్చే ప్రయత్నం చేస్తున్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 18వ తేదీ వరకు ఆందోళనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ, నగర కార్యదర్శి రాముడు మాట్లాడారు. ధర్నాలో జిల్లా నాయకులు విజయ్, సుధాకరప్ప, షరీఫ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సంబరాలు

కర్నూలు కల్చరల్: స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఏజీఎం రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏడాదిలో ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, అన్వర్, జోనల్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం నగరంలోని బిర్లాగేట్ వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న ఈట్ స్ట్రీట్ పనులు, రూ.50 లక్షలతో పెయింటింగ్ పనులు, కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల ప్రగతి గురించి ఆయా ప్రాంతాల్లోని డీఈఈలు గోపాలక్రిష్ణయ్య, రాజశేఖర్‌లతో ఆరా తీశారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు రాగా కేసీ కాల్వకు 602 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాంలో 0.554 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.